# ధన్యవాదాలు



డా॥ రావూరి భరద్వాజ

# ధన్యవాదాలు

డా. రావూరి భరద్వాజ

1

# ధన్యవాదాలు

(కవితానికలు)

డాక్టర్ రావూరి భరద్వాజ

## ...ఎందుకంటే?

**కొంతమంది** అదృష్టవంతులుంటారు. వారు పదిలంగా దాచుకోవలసినవి చాలా ఉంటాయి. మరికొంతమంది దురదృష్టవంతులుంటారు. వారికి దాచుకోవలసినవి కూడా ఏమీ ఉండవు. ఒక వేళ ఉంటే గింటే, చాలా తక్కువగా ఉంటాయి.

ఆకలిని తీర్చుకోవడానికి పిడికెడు అన్నం; శరీరాన్ని దాచుకోవడానికి జానెడు గుడ్డ; తల దాచుకోవడానికి మూరెడు నీడ; అజ్ఞానాన్ని దాచుకోవడానికి గుప్పెడు చదువు కూడా లేని వారికి - జాగ్రత్తగా దాచుకోవలసినవి మాత్రం ఏముంటాయి?

ఏమీ ఉండవని, నాకు తెలుసు!

ఈ పరమ సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకోవడానికి, నాకు చాలా సంవత్సరాలు పట్టింది.

అలా తెలియచెప్పిన వారిలో - కొండలు, బండలు; వాగులు, వంకలు; చెట్లు, చేమలు; గుళ్ళు, గోపురాలు; ఎండలు, వానలు; ఉరుకులు, పరుగులు; చీమలు, దోమలు; ఎలుకలు, చిలుకలు; దెబ్బలు, బొబ్బలు; అవమానాలు, అపవాదులు ఇంకా ఇంకా చాలా చాలా వాటితో బాటు- కొందరు మనుషులు కూడా ఉన్నారు.

ఎవ్వరూ నన్ను దరికి చేరనివ్వని రోజుల్లో, ఆప్యాయంగా ఆహ్వానించిన పంట పొలాలున్నాయి.

ఎవ్వరూ పిడికెడు అన్నం కూడా విదల్చని రోజుల్లో, తమ కాయలను ప్రసాదించిన ఫల వృక్షాలున్నాయి. కాస్సేపు నిద్రపోవడానికి తమ వసారాలోకి కూడా ఎవ్వరూ అడుగు పెట్టనివ్వని రోజుల్లో, తమ మెట్లమీదా, గోపురాలలోనూ నిద్రించడానికి అనుమతించిన దేవాలయాలున్నాయి.

రోజుల కొద్దీ, వారాల కొద్దీ, మాసాల కొద్దీ- ఈ బండలతో, ఈ చెట్లతో, ఈ గట్లతో, ఈ మెట్లతో, ఈ పొలాలతో, ఈ గోపురాలతో, ఇక్కడి జీవ జాలంతో కలిసి మెలసి బతకడం వల్ల; వీటికీ నాకూ మధ్య మంచి స్నేహం ఏర్పడింది. నా బాల్యమంతా వీటి మధ్యనే గడిచిపోయింది గనక, వీటిని చూసిన ప్రతిసారీ నాకు నా చిన్నతనం జ్ఞాపకం వస్తూ ఉంటుంది. వీటి నుండి, నా బాల్యాన్ని, నా బల్యం నుండి వీటిని విడదీయడం నాకు సాధ్యం కాదు.

వీటితో నాకేర్పడిన స్నేహం కారణంగా, వీటి నుండి నేను చాలా నేర్చుకున్నాను. ఈ నేర్చుకొన్న పాఠాలు గట్టి పునాదులుగా స్థిరపడి, నా తరువాత జీవితానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

చెట్టుతోటి, గట్టుతోటి, చెరువుతోటి, దొరువుతోటి, నాకు పరిచయాలేర్పడిన నాటినుండీ, ఇనగంటి వారితోటి నాకు పరిచయాలున్నాయి. ఆ మాట కొస్తే మూడు తరాలుగా వారి కుటుంబం, మా కుటుంబం పరస్పర సహకారంతో సహజీవనం చేశాయి- ఇప్పటికీ చేస్తున్నాయి.

నరసింహారావు గారంటే -

నాకో బంగారు కొండ,

నాకో విలువయిన అండ,

నాకో మెత్తని పాట,

నాకో పచ్చని తోట!

వందల పుస్తకాలు, వేల పుస్తకాలు చదివాడు ఈ నరసింహారావు.

ఆ పుస్తకాల సారాన్నంతా, వంట పట్టించుకొన్నాడు.

ఫలితంగా -

ఎవరు బాధపడుతున్నా చూడలేడు.

చేతనయినంత సాయం చేయకుండానూ ఉండలేడు.

ఆపాదమస్తకం, దయను నింపుకొన్న దయానిధి మా ఇనగంటి నరసింహారావు. ఆయనకు ఈ ధన్యవాదాలు సమర్పించుకొంటున్నాను.

'కాంతాలయం' — **- రావూరి భరద్వాజ**

విజయనగర్ కాలని, — 05-7-2003

హైదరాబాదు - 500 057.

ఇనగంటి నరసింహారావు గారికి ధన్యవాదాలు

- భరద్వాజ

**ఈ గ్రంథ ప్రచురణను సుసాధ్యం చేసిన**

**శ్రీ సారిపల్లి కొండలరావుగారికి**

**శ్రీ వై.జితిన్ కుమార్‌గారికి**

**శ్రీ కె.మల్లికార్జునప్పగారికి కృతజ్ఞతలు**

**"ఆకలితో** ఉన్న నిన్ను చూస్తుంటే నాకు జాలి వేసింది. అందుకని రెండే రెండు గింజలు నీ ముందుంచాను. అవి తిన్నాక నీ కన్నుల్లో మెరిసే సంతృప్తిని చూడాలని నేననుకొన్నాను. నువ్వారెండు గింజల్నీ చూసి సన్నగా నిట్టూర్చావు. వాటిని నీ పక్కనే ఉన్న నెరియలోకి దొర్లించి, పైన మట్టి కప్పావు. కప్పాక నీరసంగా వెళ్ళిపోయావు. ఓ చీమ తల్లీ! నువ్వెందుకలా చేశావ్?" అన్నాడతను.

"ఆ రెండు గింజల్ని నేనే తింటే, నా ఆకలి మాత్రమే తీరుతుంది. అవే మొలిచి ఎదిగి పది కంకులు వేస్తే పది పదుల ప్రాణులు బతుకుతాయి. నేను బతకడం కోసం వంద జీవులు బతికే అవకాశాన్ని తుడిచేయడం నాకిష్టం లేదు" అన్నదా చీమ!

✦ ✦ ✦

**బాగా** తెలుసునని మనమనుకొంటున్న చాలా అంశాలను గురించి, మనకు తెలిసింది స్వల్పమనీ, స్వల్పాతి స్వల్పమనీ, ఎప్పటికోగానీ తెలీదు. కొన్ని సందర్భాలలో ఓ చిన్న అంశాన్ని గురించి, ఏ కొంచెమో తప్ప, ఇంకేమీ తెలీదు కూడా. ఎంతో కొంత వాటిని గురించీ, వీటిని గురించీ తెలుసుకోవడాన్ని గురించి అలా ఉంచితే; మనల్ని గురించి మాత్రం మనకేం తెలుసు? ఎంత తెలుసు? మనల్ని గురించిన పరిపూర్ణమయిన అవగాహన లేని మనం మరొకరిని గురించి ఏం తెలుసుకొనగలుగుతాం? ఎలా తెలుసుకొనగలుగుతాం?

✦ ✦ ✦

**అన్నీ** వినగలమనీ, అన్నీ కనగలమనీ, చాలా మంది అంటూ ఉంటారు. కానీ వారు వింటున్నవీ, వారు కంటున్నవీ చాలా తక్కువ. వారు వినలేనివీ వారు కనలేనివీ చాలా చాలా ఎక్కువ.

మబ్బు నీరుగా జారేప్పుడు, ఓ వాన చినుకు వేసే కేకలు ఎప్పుడన్నా విన్నారా? పోనీ - చిక్కని చీకట్ల మధ్య బిక్కు బిక్కుమంటూ వెలిగే చిరుదీపం గుండె చప్పుడన్నా విన్నారా?

కవితా భారాన్ని మోయలేక, అటూ ఇటూ ఒరిగే శబ్ద సుందరి కదలికల్ని చూశారా?

అనాథల సేవకే అంకితమయిన ఓ దయామయిని చిత్రిస్తున్న చిత్రకారుని కుంచె, ఆనందంతో పొంగి పోవడమన్నా చూశారా?

మరి - ఏం విన్నట్టు?

ఏం కన్నట్టు??

✦ ✦ ✦

**నాకో** పిడికెడు, మెత్తగా ఉన్న నిద్ర కావాలి. నాకో చిటికెడు కొత్తగా ఉన్న కల కావాలి. మెత్తగా ఉన్న ఆ నిద్రమ్మగారి భుజమ్మీద, కొత్తగా ఉన్న ఈచిన్నారి బుజ్జి కల నుంచి కమ్మగా జోలపాడే ఓ 'అమ్మ' నాక్కావాలి.

✦ ✦ ✦

**అది-** అలా జరగాలనీ, అలా జరిగితే ఇంకా బావుండేదనీ, అనుకొంటూ ఉంటాం. ఇది ఇలా జరగాలనీ, ఇలా జరిగితే ఇంకా ఇంకా బావుండేదనీ అనుకొంటూ ఉంటాం.

మనం ఆశించిన దాన్ని పొందడం కోసం, నానా అవస్థలూ పడతాం. అంతేకాదు చాలా పోగొట్టుకొంటాం కూడా. ఈ అవస్థలు పడీ పడీ, ఉన్న వాటిని పోగొట్టుకొనీ పోగొట్టుకొనీ, బాగా అలిసిపోతాం, నిరాశతో కూలిపోతాం. ఇంక చేసేదేమీ లేని దశలో - అల్లంత దూరంలో, మీకు మసకమసగ్గా విజయాంకురం కనిపించినప్పటి సంచలనం; అనుభవానికి తప్ప, అక్షరాలకు అందదు!

✦ ✦ ✦

**మనలో** చాలా మంది గుడ్డివారు, చెవిటివారు, కుంటివారు, మూగవారు.

వారేమో- పున్నమి వెన్నెలలో, సహృదయుని హృదయాన్ని చూశారు. నేనేమో అదే వెన్నెలలో, ఆరబోసిన పిండిని మాత్రమే చూశాను.

వీరేమో- చివురు శిశువు పెట్టే కేరింతలను కూడా విన్నారు. నేనేమో, వీధిలోని బిచ్చగాని ఆకలికేకలు కూడా వినలేని చెవిటి వాణ్ని.

మీరేమో - దూరదూరాలలో ఉన్న జన హృదయాలలోకి చొచ్చుకు పోయారు. నేనేమో - పొరుగింటి గడపలు కూడా ఎక్కలేని కుంటి వాణ్ని.

ఆ పక్కనా, ఈ పక్కనా ఉన్న వారంతా, తమ అనుభవాలను అక్షరాలలో అందంగా పొదిగి ఆత్మీయంగా మాట్లాడతారు.

నాకలాంటి అద్భుతమయిన అనుభవాలు లేవు. ఉన్నా వాటిని అక్షరాలలో పొదగలేను. ఆత్మీయంగా మాట్లాడడం చేతకాని మూగివాణ్ణి.

✦ ✦ ✦

**"గడచిన** మూడు నాలుగు రోజుల నుండీ చూస్తున్నాను. చుట్టూ ఉన్న చిన్న చిన్న తీగలూ, పెద్ద పెద్ద చెట్లూ బాగానే ఉన్నాయి. ఈ తీవె మాత్రం దిగులు దిగులుగా కనపడుతున్నది. పిలిచినా పలకడం లేదు. ఏమయింది?'' అన్నాను చుట్టూ పక్కల మొక్కలకు దగ్గరగా జరుగుతూ.

"తను - బిడ్డల కోసం చాలా కాలంగా కలలుగంటున్నది. తన కలలను ఫల ప్రదం చేయమని, ప్రభువును ప్రార్థించింది. దయామయుడయిన ప్రభువు, ఈ తీవె తల్లి కోరికను తీర్చాడు.. ఈమెకో అందాల పూబిడ్డను ప్రసాదించాడు. ఆ బిడ్డను తనివితీరా చూసుకోకముందే, ఎవరో వచ్చి, ఆ పూవును తుంపుకెళ్ళారు. ఆ బిడ్డ మీది మమకారంతో, ఈ తీవె తల్లి, అన్నపానీయాలు కూడా ముట్టుకోవడం లేదు'' అన్నది పక్కనే ఉన్న తుంగ తల్లి నాకే వినిపించేంత మెల్లగా!

✦ ✦ ✦

**"తెలుసుకోవడం"** అన్నది ముఖ్యం.

ఈ ముఖ్య లక్ష్యాన్ని చేరుకోవడం, అనుకొన్నంత సులభం కాదు.

\- మీ వంటి, అసామాన్యులు, స్వయం కృషితో ఆ లక్ష్యాన్ని చేరుకొంటారు.

నా వంటి సామాన్యులు, జ్ఞాన సంపన్నుల సహాయంతో, ఆ లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

చూడడానికి - ఇది - సరళంగానూ, సులభ సాధ్యంగానూ కనబడుతుంది.

ముందుకు పోయినకొద్దీ, పోతున్న కొద్దీ, అతిక్లిష్టంగానూ, కష్టభూయిష్టంగానూ గోచరిస్తూ ఉంటుంది.

అలాగని - మన యత్నాలను మానుకొంటే, ఎప్పటికీ, ఏ చిన్న అంశాన్ని గురించీ, ఏమీ తెలుసుకోలేం!!

✦ ✦ ✦

**చాలా** మంది భక్తుల్ని చూస్తున్నాను. చాలా మంది స్వామిజీలను గురించి, వారు వీరు చెప్పగా వింటున్నాను. ఈ స్వాముల బోధలను కూడా కొంచెంగా విన్నాను.

"అలా ధ్యానించండి, మీ కోరికలు తీరుతాయి. ఇలా పూజించండి, మీ సంకల్పాలు నెరవేరుతాయి. ఇలా అర్చించండి, మీకు అఖండ విజయాలు లభిస్తాయి.'' అన్న అంశాలే వీరి

బోధనల నిండా క్రిక్కిరిసి ఉంటున్నాయి.

అన్ని రకాల కోరికలను తీర్చుకొనే ఉపాయాలను చెబుతున్నారే తప్ప, వాంఛా రాహిత్య స్థితిని చేరుకొనే మార్గాన్ని గురించి చెప్పరేం?

✦ ✦ ✦

**"చాలా** కాలంగా మిమ్మల్ని చూస్తున్నాను. ఎప్పుడు చూసినా ఏదో వెతుకుతూనే కనబడతారు. మీరేమయినా పోగొట్టుకొన్నారా? ఆ పోగొట్టుకొన్నది అమూల్యమయిందా? ఆత్మీయమయిందా? పోనీ - వొక నూతనాంశాన్ని కనిపెడదామని, అన్వేషిస్తున్నారా?'' అన్నాను.

''అవేమీ కాదండీ! ప్రభువుకోసం వెదుకుతున్నాను'' అన్నారు వారు.

ఓ క్షణం నిశ్శబ్దం. ఆ తరువాత చిన్న నవ్వు.

''నీలోనే ఉన్న నన్ను గుర్తించలేని స్థితిలో ఉన్న నీవు, ఎక్కడ వెదికితే మాత్రమేం లాభం? సత్యంలో, సహనంలో, కారుణ్యంలో, పరోపకారంలో, ఓదార్పులో నేనుంటానని, నీకు తెలీదా?'' అన్నారు మరొకరు.

అసలు - తొలిసారిగా ప్రశ్నించిందెవరు? దానికి జవాబు చెప్పిందెవరు? ఆ ప్రత్యుత్తరం మీద వ్యాఖ్యానించిందెవరు?

✦ ✦ ✦

**"చిర కాలంగా** మిమ్మల్నీ పరిసరాలలో చూస్తున్నాను. నాకన్నా ముందునుంచీ, ఇక్కడే మిమ్మల్ని చూస్తున్నవారూ ఉన్నారు. ఎవరిని గురించి అడిగినా, దేనిని గురించి అడిగినా, మీరు మౌనంగా ఉంటారు. మరీ గుచ్చి గుచ్చి అడిగితే! 'నాకు తెలీదు' అంటారు. దశాబ్దాలుగా మీరిక్కడుంటున్నారు గదా! ఎవరిని గురించీ, వేటిని గురించీ ఏమీ తెలుసుకోలేదా? మరి- ఏమీ తెలుసుకోకుండా ఏం చేస్తున్నారు?'' అన్నారెవరో.

''నన్ను నేను తెలుసుకొంటున్నాను'' అన్నారు స్వామి పరమానంద!

✦ ✦ ✦

**"ఆశ్చర్య పోకండి** బాబుగారూ! మనం చిరకాల పరిచయస్థులం. నిన్న సాయంత్రం కూడా నా గురించి మీరు జాలి పడ్డారు... అదే చెప్పబోతున్నాను. గడిచిన వారం రోజులుగా ఎక్కడా తిండి దొరకలేదు. అలాగే నీళ్ళు తాగి గడుపుకొస్తున్నాను. పోయిన మూడు రోజులుగా, ఆ నీళ్ళు కూడా కరువయ్యాయి. అందుకని - నిన్న రాత్రి, నా చుట్టూ కురుస్తోన్న వెన్నెలను తాగి, నా దాహాన్ని, నా ఆకలిని తీర్చుకొన్నాను'' అన్నదా తెల్లకాకి, ఆశ్చర్యంగా చూస్తోన్న నా వేపు మెల్లగా జరుగుతూ!

✦ ✦ ✦

**చాలా** మంది ఇదివరకు రాశారు, ఇప్పుడూ రాస్తున్నారు. ఇక ముందు కూడా రాస్తారు. వారి రచనల్లో కొన్ని కొంతమందికి నచ్చుతాయి. మరికొన్ని ఇంకొంతమందికి నచ్చుతాయి. ఇంకొన్ని బహుకొద్ది మందికి నచ్చుతాయి. కానీ అన్ని రచనలూ అందరకూ మాత్రం నచ్చడం లేదు. ఎందుకని?

నాకు కొన్ని రకాల చెట్లు తెలుసు. నాకు తెలిసిన చెట్లన్నీ పూస్తాయి. ఆ పూలన్నింటికీ ఏవో

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Dhanyavadalu**

* * *